


# సత్యం శివం సుందరం

**సి.అరుణ**

**"రామ్మా కొత్త పెళ్ళికూతురా" అంటూ కాఫీ గ్లాసు అందించిన తోడికోడలు వాణిని చూసి నవ్వుతూ.**

"ఇంకా కొత్తేమిటక్కా రెణ్ణెళ్ళయితేనూ" అన్నాను.

"ఏమ్మా ప్రియా! పెళ్ళప్పటికీ ఇప్పటికీ బాగా ఒళ్ళు చేసినట్లున్నావు" అంటున్న అత్తయ్యను చూసి చిరునవ్వు నవ్వుతూ, "అత్తయ్యా అమ్మ చెప్పేవరకు మీరు చదువులో ఫస్ట్ అని నాకు తెలీలేదు" అన్నాను.

"ఏముందిలే తల్లీ"అంటూ ఎవరో కేక వేస్తే వసారాలోకి వెళ్ళారు, అత్తయ్యగారు.

"ఏం ప్రియా మా మరిది ఏమంటున్నాడు?" అంది వాణి.

"ఏమంటారు? మా అమ్మ చాలా మంచిది. మా నాన్నగారు గొప్ప కథా రచయిత. మా వదిన వంట చాలా బాగా చేస్తుంది. మా అన్నయ్య కవితల్లో మునిగి తేలుతుంటాడు" అని.

"అదేంటి ఇవి తప్ప మీమధ్య మాటలేం లేవా?" అన్నది వాణి చిలిపిగా.

"అయ్యో లేకేం ఉన్నాయ్. అవి కూడా చెప్తా విను. కాలేజీలో ఫలానా టైంలో ఎక్స్‌ట్రా అవర్స్ వర్క్ చేయాలి. ప్రస్తుతానికి నువ్వు పిహెచ్‌డీ చెయ్యి. జాబ్ పిల్లలు పెద్దవాళ్ళయ్యాక చెయ్యొచ్చు. నేను రాసే కథలు కాస్త ఫెయిర్ చేసిపెట్టు" లాంటివి.

"సరి సరి. ఆలూ లేదు చూలు లేదన్నట్లు ఇంకా పిల్లలు పుట్టనే లేదు అప్పుడే పెద్దవాళ్ళయ్యే విషయమా?"

సాయంత్రం వాణక్క, నేనూ మల్లెమొగ్గలు తుంచి పెరట్లో మాల కడుతున్నాం. లోపలనుండి ఏదో చప్పుడైనట్లుగా ఉంటే హడావుడిగా వెళ్ళి చూశాం. పనిమనిషి సుబ్బమ్మ చీపురుతో స్టోర్‌రూంలో దభీదభీ అని నేలకేసి దేన్నో కొడుతూంది.

"ఏమైంది"అంటూ అత్తయ్యగారు, మామయ్యగారు, బావగారు అందరూ వచ్చారు.

"ఏం లేదమ్మా రెండు పెద్దపెద్ద ఎలుకలు అదిగోండి ఆ ఇనప్పెట్టెల వెనక దాక్కున్నాయి చప్పుడు చేసి బయటకు రప్పిద్దాం అని"అంటూ హడావుడి చేస్తోంది.

"అసలు ఆ ఇనప్పెట్టెలక్కడ్నించి తీయమని నీకు కాపురానికొచ్చినప్పట్నించి చెప్తున్నాను. విన్నావా? అసలే పాత కాలపు కొంప. ఇద్దరు కొడుకులు ఉద్యోగాలు వెలగపెట్టి ఏం చేస్తున్నారు కాస్త ఇంటిని బాగుచేయిద్దాం అన్న ధ్యాస ఉంటే కదా? రేపు సాయంత్రానికల్లా నాకు ఆ స్టోర్‌రూంలో పచారీ వస్తువులు తప్ప మిగతావేం కనపడకూడదు. నేను నవల రాసేటప్పుడు డిస్టబెన్స్ ఉండకూడదని ఎన్నిసార్లు చెప్పాను?" మామగారి వాక్ప్రవాహం కొనసాగుతూంది.

"నువ్వు చాలా అదృష్టవంతురాలివి. నీకున్న సాహిత్యాభిలాషకు తగ్గట్లే పేరుపొందిన నవలా, కథా రచయిత మోహనరావుగారి కోడలు కాబోతున్నావు. కాకపోతే మీ మామగారు కాస్త కోపిష్టి అని విన్నాను" కాపురానికొచ్చేముందు ఒక రోజు పూల జడ వేస్తూ అమ్మ అన్న మాటలు గుర్తొచ్చాయి.

అత్తయ్యగారి ముఖంలో సన్నని నీటి పొర బయటకు రావాలా వద్దా అనుకుంటూ ఆగిపోవడం గమనించాను.

"ఏంటమ్మా ఇది. ఏవో చిన్నప్పటి చిత్తుకాగితాలన్నీ అలాగే ఉంచావు. అవి చెదలుకూడా పట్టేస్తున్నాయి. తీసి అవతల పడెయ్యచ్చుకదా!" అంటున్న బావగారి వైపు వాణి చురుగ్గా చూసింది.

"చూసింది చాల్లే. పెద్ద మల్లాది సుబ్బమ్మలు బయలుదేరారు. ఒక కప్పు కాఫీ తీసుకురా!"అంటూ బావగారు తన గదిలోకి వెళ్ళిపోయారు.

ఇంతకీ ఆ పెట్టెల్లో ఏముందో. సాయంత్రం శరత్ వస్తే అడగాలి అనుకున్నాను.

❋ ❋ ❋

"మా అమ్మ చిన్నతనంలో రాసుకున్న పాటలు, వేసిన బొమ్మలూ, ఇంకా ఏవేవో పద్యాలు, ఎక్స్‌ట్రా, ఎక్స్‌ట్రా"అన్నాడు శరత్ చేగోడీలు నములుతూ.

"ఆవిడ మరి అంత అపురూపంగా దాచుకున్నది. మీ నాన్నగారికెందుకు కోపం?" అన్నాను. ఆశ్చర్యంగా.

"అమాయకపు బ్రహ్మా! మీ ఆడవాళ్ళు కాస్త చదువులు చదువుకోగానే పెద్ద ఫీలయిపోతుంటారు. అంటున్న శరత్ మాటలకడ్డమొచ్చి,

"అయితే నేనడిగిన దానికి దీనికి ఏంటి సంబంధం?" అన్నాను.

"వస్తున్నా! ఆవిడ ఆ కాలంలో మా అమ్మమ్మగారింట కాక ఏ కందుకూరి వీరేశలింగం ఇంట్లోనో, గురజాడ గారింట్లోనో, చలంగారింట్లోనో పుట్టి ఉండాల్సింది. సరే పుట్టకపోయినా కనీసం మెట్టి ఉండాల్సింది. మా నాయనమ్మ, తాతయ్యగార్లది కాస్త సంప్రదాయక కుటుంబం. మా నాన్నగారు కూడా తగ్గట్లే ఆడవారి పట్ల ప్రత్యేకమైన అభిప్రాయాలంటూ ఏం లేవు. అలా అని చెడ్డవాడేం కాదు ఆయన కథా సాహిత్యంలో చిన్నతనం నుండే కృషిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగి ఈరోజు టీవీ సీరియల్స్‌కి కూడా కథలందిస్తున్నారు. అసలు మోహన్‌రావ్ అంటే ఎంత ఫేమస్సో తెల్సా? అఫ్‌కోర్స్ మా అన్నయ్య, నేనూకూడా ఛోటా రచయితలమే అనుకో."

"అంటే ఆ జీడిపాకం సీరియల్స్ రాసింది మీ నాన్నగారా?"

"ష్. గట్టిగా అరవకు. ఎవరన్నా వింటే బాగోదు".

"బాబాయ్... నీకు ఫోన్"అంటూ శ్రావ్య వచ్చి చెప్పడంతో ఆ డిస్కషన్ అక్కడితో ఆగిపోయింది.

❋ ❋ ❋

టేప్ రికార్డర్‌లో జేసుదాస్ పాటలు వింటూ తల చిక్కు తీసుకుంటూ ఆలోచించసాగాను. తెలిసినంతవరకు అత్తయ్య చాలా ఇంటలిజెంట్. కానీ ఆమె ఇంటలిజెన్స్, టాలెంట్స్ సబ్‌మిసివ్‌గా ఉండిపోయాయి. అత్తామామలు, భర్త అందరూ ఆమెలోని టాలెంట్ బయటకు రానీకుండా చేయడమేకాక ఆడవారు ఏమీ సాధించలేరనే అపోహతో ఆమె ఆలోచనలు అన్నీ తొక్కిపెట్టారు. ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా? భరత్, శరత్‌లు డిటోడిటో పెళ్ళిచూపులనాడు ఆ కవితలు, కథల ఫైల్ అన్నయ్య చూపించబోతే శరత్ అంత ఇంట్రస్ట్ చూపకపోవడంనుంచి ఇప్పటివరకు మా మధ్య సాహిత్య చర్చలు, జరిగే సందర్భాలు లేకపోవడం, తన కథల ఫైల్స్, పబ్లిష్ అయిన, కాబోతున్న కవితల సంపుటి శరత్ ఉత్సాహంగా చూపడం, నేనేదో చెప్పపోతే దాటవేయడంవరకు అన్నీ గుర్తొచ్చాయి నాకు. వాణీ కూడా చదువుకున్న అమ్మాయే. తనకూ ఇక్కడ పెద్దగా వేల్యూలేకపోవడం ఈ నాల్రోజుల్లో గమనించాను. ఇక శ్రావ్య పరిస్థితి కూడా ఇంతేకదా!

"పిన్నీ అమ్మ భోజనానికి రమ్మంది" శ్రావ్య వచ్చి పిలవడంతో ఈ లోకంలోకి వచ్చాను.

భోజనాల బల్లమీద తండ్రీ కొడుకులంతా ఏదో విషయంపై సీరియస్‌గా డిస్కస్ చేసుకుంటున్నారు.

"అరె శరత్! నెక్స్ట్‌వీక్ లాస్ట్... ఇది చాలా ప్రతిష్టాత్మకమైన ఐ మీన్ ప్రెస్టేజియస్ కథల పోటీ. ఆ వారపత్రిక ఈ పోటీలో ఫస్ట్‌ప్రైజ్, సెకండ్ ప్రైజ్ వచ్చిన కథలు నెట్‌లో పెట్టి మళ్ళీ సెకండ్ టైం నెటిజన్స్ ఛాయిస్ ప్రకారం మళ్ళీ ఫస్ట్, సెకండ్ ర్యాంక్స్ ఇస్తారట. అప్పుడు కానీ ఫస్ట్ వస్తే ఇక మనకు పండగే."

"అంటే ఇంటర్నెట్‌లో కథల పోటీనా?" ఆసక్తిగా అడిగాను.

"ఒక రకంగా అలాంటిదే. మన కథలు పత్రికలో పబ్లిష్ అయి ఫస్ట్‌ప్రైజులెన్నో వచ్చాయి. ఇప్పుడంతా కంప్యూటర్ కాలంకదా. ఈసారి నెటిజెన్స్ ఛాయిస్" అన్నాడు శరత్.

"నాన్నా! ఎలాగైనా మనం ఈ దెబ్బతో మనం రౌలింగ్ అంత ఫేమస్ అయిపోతాం వరల్డ్ వైడ్" భరత్ బావగారు ఉత్సాహంతో ఉరకలేస్తున్నారు.

"ఇంతకీ థీమ్ సెలెక్ట్ చేసుకున్నారా?" అన్నాను. మామగారు ఎందుకో నావైపు సీరియస్‌గా చూసి చేయి కడుక్కుని లేచారు.

"చూడమ్మా! ఏ పని ఎవరు చెయ్యాలో వాళ్ళుచేస్తే అందం. నీలా చదువుకున్నవాళ్ళు కూడా అన్ని విషయాల్లో కల్పించుకోకూడదనే విజ్ఞత నేర్చుకోకపోవడం వింతే!"అని మా నాన్నగారు అనక ముందే నేనే అనేస్తున్నాను. కామ్‌గా ఉండు" అన్నాడు శరత్.

"ఓ! మేల్ డామినేషనా?" అన్నాను వ్యంగ్యంగా. "ప్రియా ఊరుకోమ్మా"అంది అత్తయ్య మామగార్ని చూపిస్తూ సైగ చేస్తూ.

* * *

"కొత్త బిచ్చగాడు పొద్దెరగడని, తన పాండిత్యమంతా ప్రదర్శించాలని చూస్తున్నట్లుంది మీ ఆవిడ... కాస్త చెప్పు" మెట్లెక్కుతున్న నాకు మామగారి మాటలు చెవిన పడి ఆగాను.

"దానికేం తెలుస్తుంది లెండి. చిన్న పిల్ల. నేను చెప్తాను" అత్తయ్య గొంతు.

"ఎవరికివాళ్ళు యద్దనపూడి సులోచనారాణులు, మాలతీ చందూర్‌లు అయినట్లు ఫీలైపోతే ఎలా? కాపురానికొచ్చిన కొత్తలో మా ఆవిడ కూడా అంతే కదా" బావగారి మాటలు విని కొంచెం ఆశ్చర్యమేసింది.

* * *

"ఏం చేస్తున్నారు మీరిక్కడ. వడియాలు పెడుతున్నారా? అమ్మలక్కల కబుర్లు చెప్తున్నారా?" శరత్ మేడపైకి వచ్చి అడిగాడు.

"కబుర్లు చెప్తూ వడియాలు పెడుతున్నాం" అన్నాను.

"ఈమధ్య గమనిస్తున్నాను. ఏంటీ మీ ముగ్గురూ ఏదో ఒకచోట గ్రూప్ అయి తెగ డిస్కషన్స్ పెడుతున్నారు?

"ఏం మావి అమ్మలక్కల కబుర్లేకదా! మీకు ఏంటి?" అన్నాను చిరుకోపంగా. "లేక టీవీ సీరియల్స్‌లో అత్తాకోడళ్ళలా ఫైటింగ్ చేసుకోవాలా?" అన్నా.

"ప్రియా ఊరుకోమ్మా!" అంటూ అత్తయ్య వారిస్తూ "నాన్నగారు స్కూలునుంచి ఇంకా రాలేదా?" అనడిగింది.

"లేదమ్మా"అంటూ ఫోన్ మోగితే కిందికెళ్ళాడు శరత్.

"ఏమైనా మామగారు స్కూల్లో వర్క్‌చేస్తూ ఇలా కథా రచయిత కావడం గ్రేటే"అన్నాను పిండి చేతులు కడుక్కుంటూ.

"అసలా ఛాన్స్ ఈమెకు రావాల్సింది"అంటూ వాణి చెప్పబోయి అత్తయ్య ముఖం చూసి ఆగిపోయింది.

"నాకు తెల్సు. అత్తయ్యకి టీచర్ పోస్ట్‌వస్తే మామయ్యగారు చేరనీయలేదని" అన్నాను.

"ఇప్పుడవన్నీ ఎందుకమ్మా పదండి భోజనాల వేళయింది" అంటూన్న అత్తయ్యని అనుసరించాము.

* * *

"పోస్ట్"అన్న కేకతో మెలకువ వచ్చి బయటకొచ్చాను. "కొరియర్ మేడం"అంటూ ఒక కవర్ ఇచ్చాడు కొరియర్ అబ్బాయి.

"ఎవరమ్మా" అంటూ అత్తయ్య లోపల నుండి వచ్చింది.



"చూడమ్మా! ఏ పని ఎవరు చెయ్యాలో వాళ్ళుచేస్తే అందం. నీలా చదువుకున్నవాళ్ళు కూడా అన్ని విషయాల్లో కల్పించుకోకూడదనే విజ్ఞత నేర్చుకోకపోవడం వింతే!"

"కొరియర్ అత్తయ్యా" అన్నాను.

అప్పుడే స్కూటర్ దిగి భరత్, వాణి, శ్రావ్య లోపలికి వచ్చారు.

"ఏంటమ్మా ఆ కవర్. అరే...అరే... ఇది ఆ వీక్లీ... మాటలు పూర్తి కాకుండానే నా చేతిలోంచి లాక్కొని భరత్ "యాహూ"అని అరిచి చకచకా కవర్ విప్పి చూశాడు.

అత్తయ్యా, నేనూ ఆశ్చర్యంగా చూస్తూ, "ఏమైందని అడిగే లోపలే పాపం మా బావగారి ముఖం చిన్నబోయింది."

వాణి ధైర్యంచేసి అతని చేతిలోని కవర్ తీసికొని చూసి నా చేతికిచ్చింది.

ఇంకా ఈ లోకంలోకి రాని బావగారి మొహం చూస్తూ మేటర్ చదివాను, చిన్న చిరునవ్వు నా పెదాల మీదకు వచ్చి మాయమైంది.

"ఏముందమ్మా అందులో"అంది అత్తయ్య.

"ఏం లేదండీ. ఈమధ్య వీళ్ళు చెప్పిన ప్రెస్టిజస్ కథల పోటీ రిజల్ట్స్. మా వారూ, బావగారూ పంపిన కథని సాధారణ ప్రచురణకు తీసుకున్నట్లు, ఎవరో కొత్త రచయితలట సత్యం, శివం, సుందరంల కథ ఫస్ట్‌ప్రైజ్‌కి సెలక్టయినట్లు వచ్చింది" అన్నాను.

"అలాగా!"అని అత్తయ్య, "ఒరే భరత్! లేరా లేచి కాఫీ తాగు"' అంటూ బావగారిని తట్టి లేపారు.

ఇంతలో మామగారూ, శరత్ కూడా వచ్చారు. అందరికీ విషయం అర్థమయింది.

పక్క దుప్పట్లు పరుస్తుంటే శరత్ అన్నాడు,

"నేను చాలా డిస్కరేజ్ అయ్యాను ప్రియా! అందుకే అన్నారు మనిషికి ఓవర్ కాన్ఫిడెన్స్ ఉండకూడదు అని. ఫెయిర్ కాపీ నీ చేత చేయించినా బాగుండేది ఛ."

"వద్దు లెండి. ఎవరుచేసే పని వాళ్ళు చెయ్యాలి. ఇంతకీ ఏ సబ్జక్ట్‌మీద కథలేరు?" అన్నాను.

ఏ కథనున్నాడో చెప్పాడు శరత్.

"ఏముంది. ఎదుటివారిలో మంచి గుర్తించడంవలన మానవత్వం కొత్త పుంతలు తొక్కుతుంది. మన ఆలోచనా దృక్పథాల్లో మార్పురావాలి అనే విషయం అంతర్లీనంగా చెపుతూ భార్యాభర్తల ఉదంతాన్ని ఉదాహరణగా చూపిస్తూ కథల్లాం".

"అంటే భార్యని భర్త కనీసం, నీలో ఉన్న ప్రతిభ గుర్తించాను. నీ కృషి హర్షిస్తున్నాను. నీకు అసాధారణమైన తెలివితేటలు ఉన్నాయి సుమీ! అని పొగుడుతూ ఉంటాడా?"

"ఛ ఛ. ఇవ్వన్నీ నిజజీవితంలో జరుగుతాయా? ఉల్టాగా చెప్తే ఎవరికైనా నచ్చుతుందా?"

"అదే మీ పొరపాటు. నేను చెప్తున్నానని తప్పుగా అనుకోకండి. ఇంకా ఆడవారు వెనకబడి ఉన్నారనే భావన మీ మగవారిలో పూర్తిగా తుడిచిపెట్టుకుపోలేదు. వారి పట్ల చూపాల్సిన కనీస సానుభూతి, ప్రోత్సాహం చూపకపోవడం, మీరు చేస్తున్న తప్పు ఇప్పుడంతా కొత్తగా ఆలోచించాలి. ఆడవారిని మెయిన్ విలన్లుగా చూపి టీవీ సీరియల్స్ రాస్తే చెల్లుతాయి కానీ, నెట్‌లో పెట్టే ఇలాంటి లేటెస్ట్ కంటెస్ట్‌లలో ఆడవారిని చిన్నతనంగా చూపితే నెగ్గుతారా?" పూల తోటలో కలుపుమొక్కలు లాగేసినట్లు నిరర్థకపుటాలోచనలు సమూలంగా ఏరివేస్తే మనసు విశాలమవుతుంది. కొత్త భావాలకు చోటు దొరుకుతుంది. కొత్త భావాలలో నవ్యత, విశాలత గోచరిస్తాయి."

"నిజమే ప్రియా! నాకు ఏదో జ్ఞానోదయం అయినట్లుగా ఉంది. వేడిగా ఓ టీ ఇస్తావా?"

* * *

"ఆ పేరుగల వాళ్ళెవరూ ఇక్కడ లేరంటే వినవేం?" మామగారి కేకలతో వంటింట్లో ఉన్న అత్తయ్య, నేనూ వాణక్కా, హాల్లోంచి భరత్, శరత్ బయటకి వచ్చాము.

"ఇంటి అడ్రస్ ఇదే సార్! చూడండి" అతను వాదిస్తున్నాడు.

"అతను చెప్పింది కరెక్టే మామగారూ! ఆ మనీ ఆర్డరు మనదే" అన్నాను నేను.

"ఏంటమ్మా! సత్యవాణి, శివప్రియ, సుందరలక్ష్మి ఎవరు వీళ్ళంతా?..." అంటూనే అర్థమయినట్లు తలూపి లోపలికి వెళ్ళారాయన.

"మేము సంతకాలు చేసి డబ్బు తీసుకొని మామగారి చేతిలో పెట్టాము."

"క్షమించండి మామగారు. అత్తయ్యగారు చక్కటి కవయిత్రి, రచయిత్రి అని మీకు తెలియంది కాదు. నేనూ ఓ మోస్తరు రచయిత్రినే. కానీ మా పట్ల మీకు సదభిప్రాయం లేదని తెల్సాక మేము ముగ్గురం ఆలోచించి ఒక చక్కని కథ రాసి మీతో పాటే అదే కథల పోటీకి, అత్తయ్య చేత ఫెయిర్ చేయించి, సత్యం శివం సుందరం పేరుతో పంపాము. ఏదో సాధారణ ప్రచురణకు స్వీకరిస్తారనుకున్నాము కానీ ఇలా ఫస్ట్‌ప్రైజు వస్తుందని అనుకోలేదు" అన్నాను.

అప్పుడు మామగారి మొగం చూడాలి!!

రచయిత చిరునామా:
సి.అరుణ,
17/84, తిప్పరాజువారి వీధి,
నెల్లూరు- 524001.